www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 7 ఏప్రిల్ 2024



పరిశుభ్రత పాటించాలి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఈనెల 7వ తేదీన ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శిశు గృహాన్ని సందర్శించి, పిల్లలకు అందుతున్న సౌకర్యాలను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ పరిశీలించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరిలో శనివారం స్థానిక విద్యానగర్‌లోని శిశు గృహాన్ని సందర్శించారు. వారికి అందుతున్న వైద్య సదుపాయాలపైన పరిశుభ్రతపైన వివరణ అడిగి తెలుసుకున్నారు. పరిశుభ్రతను పాటించినప్పుడే ఆరోగ్యవంతమైన జీవితం పొందవచ్చని, కావున మంచి ఆరోగ్యానికి స్వచ్ఛమైన గాలి, నీరు, పోషకాహారమైన ఆహారం తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ పీడీ కెవివియల్.పద్మావతి, డిసిపి సూర్యచక్రవేణి పాల్గొన్నారు.

రాజకీయ 'రంగులు'..!



- అధికారంలో ఉన్నప్పుడు ఒకలా.. ఎన్నికల తరుణంలో మరోలా
- టిడిపి, వైసిపి, బిజెపి నేతల్లో ఇదే ధోరణి
- ప్రజాసమస్యలపై నేతల భిన్న స్వరాలపై జనంలో చర్చ
- 2014 నుంచి 2024 వరకూ అవే సమస్యలపై వాగ్దానాలు
- నరసాపురం, పాలకొల్లు పర్యటనలో చంద్రబాబు ప్రసగంలోనూ అదేతీరు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఊసరవెల్లి రంగులు మార్చిన విధంగా ఎన్నికల తరుణంలో రాజకీయ నాయకుల మాటల్లో రంగులు మారుతున్న తీరు చూసి జిల్లా ప్రజానీకం నోరెళ్లబెడుతున్నారు. ప్రజా సమస్యలపై అధికారంలో ఉన్నప్పుడు ఒకలా.. ఎన్నికల సమయంలో మరోలా మాట్లాడుతూ జనాన్ని ఏమార్చేందుకు టిడిపి, వైసిపి, బిజెపి నేతలు చేస్తున్న విన్యాసాలు అన్నీ ఇన్నీ కావనే చెప్పాలి. శుక్రవారం పాలకొల్లు, నరసాపురంలో జరిగిన చంద్రబాబు పర్యటనలోనూ ఇదే ఒరవడి కనిపించింది. రాష్ట్ర విభజన తర్వాత 2014 ఎన్నికల్లో టిడిపి, వైసిపి నాయకులు ఏ సమస్యలు తీరుస్తామని ప్రజలకు వాగ్దానాలు చేశారో.. 2024 ఎన్నికల్లోనూ అవే సమస్యలపై హామీలు గుప్పిస్తూ ప్రసంగాలు చేస్తున్న పరిస్థితి నెలకొంది. 2014 ఎన్నికల్లో జిల్లాలో తాగునీరు, కొల్లేరు, పోలవరం నిర్వాసితుల సమస్యలు, డ్రెయినేజీ వ్యవస్థ, వశిష్ట గోదావరిపై వంతెన, ఆర్అండ్‌బి రోడ్లు, సముద్రతీరంలో షిపింగ్ హార్బర్ నిర్మాణం, కాలుష్యాన్ని అరికట్టడం వంటి అనేక హామీలను టిడిపి, వైసిపి అధినేతలు అప్పటి ఎన్నికల్లో గుప్పించారు. 2014 ఎన్నికల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 15 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాలు ఉండగా టిడిపి, బిజెపి పొత్తులో భాగంగా అన్ని స్థానాలనూ గెలుచుకున్నాయి. ఐదేళ్లపాటు చంద్రబాబు ముఖ్యమంత్రిగా పాలన సాగించారు. జిల్లా వ్యాప్తంగా ఆక్వా కాలుష్యంతో తాగునీరు దెబ్బతినడంతో జనం దాహం తీర్చే పరిస్థితి లేకుండాపోయింది. తాగునీటి సమస్య పరిష్కరిస్తామని ఎన్నికల్లో చెప్పి అధికారంలోకొచ్చిన టిడిపి ఐదేళ్లలో సమస్యను పరిష్కరించలేకపోయింది. కొల్లేరును మూడో కాంటూరుకు కుదిస్తామని మాటిచ్చి నెరవేర్చలేదు. ఫిషింగ్ హార్బర్ నిర్మాణం, కాలుష్యం అరికట్టడం, పోలవరం నిర్వాసితులకు పునరావాసం, చింతలపూడి రైతులకు న్యాయమైన పరిహారం ఏ ఒక్కటీ నేరవేర్చని పరిస్థితి నెలకొంది. 2019 ఎన్నికల్లో జగన్ మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం జిల్లా సమస్యలను పరిష్కరించడలో విఫలమైందని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత తాగునీటితో పాటు పోలవరం నిర్వాసితులకు పరిహారం పెంచి ఇస్తామని, రోడ్లు బాగుచేస్తామని, టిడ్కో ఇళ్ల బ్యాంకు రుణాలు రద్దుచేస్తామని, కొల్లేరు ప్రజలకు న్యాయం చేస్తామని, పర్యాటక అభివృద్ధి చేస్తామంటూ, చింతలపూడి రైతులకు న్యాయమైన పరిహారం ఇస్తామంటూ తన పాదయాత్రలోనూ, ఎన్నికల ప్రచారంలో అనేక సమస్యలపై హామీలు గుప్పించారు. వైసిపి ఐదేళ్ల పాలనలో జిల్లాలో ప్రజల సమస్యలు ఏ ఒక్కటీ పరిష్కారం కాలేదు.

మళ్లీ తాగునీరు సమస్యపైనే ప్రసంగాలు

జిల్లా పర్యటనలో టిడిపి అధినేత చంద్రబాబుతోపాటు, నియోజకవర్గాల్లో వైసిపి నేతలు సైతం గతంలో ఇచ్చిన హామీలపైనే మళ్లీ కొత్తగా మాట్లాడుతున్న పరిస్థితి నెలకొంది. నరసాపురం, పాలకొల్లులో చంద్రబాబు తన పర్యటనలో మాట్లాడుతూ తాము అధికారంలోకొచ్చాక పైప్‌లైన్ ద్వారా తాగునీరు అందిస్తామంటూ మళ్లీ మాట్లాడిన పరిస్థితి నెలకొంది. ఫిషింగ్ హార్బర్, వశిష్టగోదావరిపై వంతెన నిర్మాణం వంటి సమస్యలపై 2014లోనూ చంద్రబాబు హామీ ఇచ్చారు. పదేళ్ల తర్వాత జరుగుతున్న ఎన్నికల్లోనూ అదే సమస్యలపై ఆయన మాట్లాడడం జిల్లా ప్రజానీకంలో చర్చనీయాంశంగా మారింది. ఇక వైసిపి నేతలు సైతం అదే విధంగా మాట్లాడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. తాగునీరు, రోడ్ల వంటి అనేక సమస్యలను ఐదేళ్లలో వైసిపి పరిష్కరించలేదు. ఇప్పుడు ప్రజల వద్దకు వెళ్లి తాము అధికారంలోకి వస్తే సమస్యలు పరిష్కరిస్తామంటూ వాటినే ప్రస్తావించడం అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తుతోంది.

పోలవరంకు నిధులు ఇవ్వని బిజెపి.. పోలవరం పూర్తిచేస్తుందట..

రాష్ట్ర విభజన నేపథ్యంలో పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా చట్టంలో పొందుపర్చారు. ప్రాజెక్టు అయ్యే ఖర్చు మొత్తం కేంద్రమే భరిస్తుందని అందులో పేర్కొన్నారు. 2014 నుంచి కేంద్రంలో బిజెపికి చెందిన మోడీ సర్కారే అధికారంలో ఉంది. పోలవరానికి నిధులు ఇవ్వకుండా ముప్పుతిప్పలు పెడుతోంది. నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలంటే రూ.30 వేల కోట్లు అవుతుందని, కేంద్రం నిధులిస్తే తప్ప తాము ఏమీ చేయలేమని సిఎం జగన్ తన ప్రసంగాల్లో అనేక సార్లు తెలిపిన పరిస్థితి నెలకొంది. ఇప్పుడు టిడిపి, జనసేన, బిజెపి పొత్తుపెట్టుకుని ఎన్నికల బరిలోకి దిగాయి. బిజెపి నాయకులు రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ ఎన్‌డిఎ సర్కార్ వస్తేనే పోలవరం పూర్తవుతుదంటూ మాట్లాడుతున్న పరిస్థితి నెలకొంది. జిల్లాకు వచ్చిన బిజెపి నేతలంతా పోలవరం పూర్తవ్వాలంటే ఎన్‌డిఎ సర్కార్ రావాలంటూ మాట్లాడడం చూసి అంతా విస్తుపోతున్నారు. రాజకీయ నాయకులు మారుస్తున్న రంగులు చూసి జనానికి ఏంచేయాలో అర్థంకాని పరిస్థితి కొనసాగుతోంది.

క్రీడాకారులకు అభినందన

జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ స్కేటింగ్ పోటీలకు అర్హత సాధించిన జిల్లా క్రీడాకారులను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాసరావు అభినందించారు. మార్చి 26వ తేదీ నుంచి 31వ తేదీ వరకు తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలలో జిల్లా ఇండోర్ స్టేడియం క్రీడాకారులు భువన రత్న శ్లోక 11 సంవత్సరాల లోపు రింక్-1, రింక్-2 విభాగాలలో రెండు రజత పతకాలు, సిహెచ్.మౌనిక దివ్యశ్రీ 17 సంవత్సరాల లోపు రింక్-1 విభాగంలో రజత పతకం, రింక్-2లో కాంస్య పతకం సాధించారు. వీరు ఈనెల 10వ తేదీ నుంచి 15వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని సత్నా జిల్లాలో జరుగు 67వ జాతీయ స్కూల్ గేమ్ పోటీలలో పాల్గొనుటకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా శనివారం జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు ఎంపిక కాబడిన క్రీడాకారులను, శిక్షకుడు షేక్ ఖాసింను అభినందించారు. జాతీయ స్థాయి పోటీలలో మంచి ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



క్రీడాకారులను అభినందిస్తున్న శ్రీనివాసరావు



ఆందోళన చేస్తున్న కార్యకర్తలు, నేతలు

'రామరాజు'ను మార్చడం తగదు

చంద్రబాబు కాన్వాయ్‌ను అడ్డుకున్న టిడిపి ఉండి కార్యకర్తలు

రఘు రామకృష్ణంరాజు టిడిపిలో చేరడంతో హాట్‌టాఫిక్‌గా ఉండి రాజకీయం

ప్రజాశక్తి - పాలకొల్లు

ఉండి నియోజకవర్గ అభ్యర్థి మంతెన రామరాజును మార్చడం తగదంటూ ఆ నియోజకవర్గంలోని కార్యకర్తలు, నాయకులు చంద్ర బాబు నాయుడు కాన్వాయ్‌ను అడ్డుకునే ప్రయత్నం జరిగింది. పాలకొల్లులో ఎస్ కన్వెన్షన్ హాల్లో శనివారం జరిగిన నరసాపురం పార్లమెంటు నియోజకవర్గంలోని ఏడు నియోజకవర్గాల ముఖ్య నేతలతో చంద్రబాబు సమావేశమయ్యారు. శుక్రవారం పాలకొల్లులో జరిగిన చంద్రబాబు బహిరంగ సభలో కనుమూరి రఘు రామకృష్ణంరాజు టిడిపిలో చేరారు. దీంతో ఆయనకు ఉండి టిక్కెట్ ఇవ్వనున్నట్లు పెద్దఎత్తున ప్రచారం సాగుతోంది. దీంతో ఇప్పటికే ప్రకటించిన టిడిపి ఉండి అభ్యర్థి మంతెన రామరాజు అనుయాయుల అరగంటకు పైగా నినాదాలతో సభా ప్రాంగణం దద్దరిల్లింది. లోపల సమావేశాలు జరుగుతున్నా బయట దాదాపు 200 మందికి పైగా కార్యకర్తలు గట్టిగా నినాదాలు చేశారు. సమావేశం ముగిసి చంద్రబాబు విడిదికి వెళుతుండగా ఆయన కాన్వాయ్‌ను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో చంద్రబాబు రక్షణ సిబ్బంది కార్యకర్తలను పక్కకు నెట్టి చంద్రబాబును లంచ్ కోసం విడిదికి తీసుకెళ్లారు. హాలు వద్ద కార్యకర్తలు గట్టిగా నినాదాలు చేయడంతో అక్కడికి చేరుకున్న ఎంఎల్ఎ మంతెన. రామరాజు కార్యకర్తలు శాంతంగా ఉండాలని కోరారు. అనంతరం ఎంఎల్ఎ రామరాజు మీడియాతో మాట్లాడుతూ కొన్ని పత్రికల్లో వచ్చిన వార్తలు తమ కార్యకర్తల మనోభావాలను దెబ్బ తీశాయన్నారు. దీంతో వారంతా ధర్నాకు పూనుకున్నట్లు చెప్పారు. తాను పార్టీ అధినేత చంద్రబాబు మాట శిరసావహిస్తానని అలాగే కార్యకర్తల మాటకు విలువ ఇవ్వాల్సిన అవసరం కూడా ఉందన్నారు. ఆందోళన తీవ్రతరం అవుతుండడంతో హాల్ వద్ద పెద్ద ఎత్తున పోలీసులు మోహరించారు. చంద్రబాబు గుంటూరు జిల్లాకు బయలుదేరే ముందు రామరాజు చంద్రబాబుతో మంతనాలు జరిపారు. అనంతరం తమకు అనుకూల వాతావరణం ఉందని కార్యకర్తలు శాంతంగా ఉన్నారు. ఆఖరి నిమిషంలో ఎంపీ కనుమూరి రఘురాంకృష్ణంరాజు చంద్రబాబు నాయుడును కలవడానికి ప్రయత్నించగా ఆయన్ని కలవకుండానే చంద్రబాబు గుంటూరు జిల్లాకు బయలుదేరారు. హెలీపాడ్ వద్ద మాత్రం షేక్ హ్యాండ్ ఇచ్చి చంద్రబాబు వెళ్లిపోయారు. పాలకొల్లు జనసేన నేతలు ఆఖరి నిమిషంలో సినీ నిర్మాత బన్నీవాసు సారథ్యంలో చంద్రబాబుతో మంతనాలు జరిపి ఫొటోలు తీసుకున్నారు.

వేసవిలో ఉపాధి పనులు కల్పించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వేసవిలో ఉపాధి హామీ పనులు వెంటనే ప్రారంభించి పేదలకు ఉపాధి కల్పించి ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉపాధి పనులు వేసవిలో ప్రారంభమవుతాయని, ఏప్రిల్ ప్రారంభంలోనే పనులు ముమ్మరంగా జరుగుతుంటాయని తెలిపారు. ఈ సంవత్సరం ఏప్రిల్ 6వ తేదీ దాటిపోతున్నా జిల్లాలో ఇంకా ఉపాధి పనులు కేవలం 12 మండలాల్లో మాత్రమే ప్రారంభం కావడం కూలీల జీవనోపాధిని దెబ్బతీయడమేనని పేర్కొన్నారు. ఇప్పటి వరకూ ఉపాధి హామీ పనికి రోజుకు రూ.272 వేతనం ఇచ్చేవారని, ప్రస్తుతం రూ.28 పెంచి రూ.300 వేతనంగా ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించినా సర్వర్ పనిచేయడం లేదనే సాకుతో అధికారులు కాలయాపన చేయడం తగదని విమర్శించారు. తక్షణం ఉపాధి హామీ పనులు చూపించాలని డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లా మొత్తంగా ఇంకా ఉపాధి హామీ వేతన బకాయిలు 2023 డిసెంబర్ నుండి సుమారుగా 4.50 కోట్లు ఉందని, దీనిని వెంటనే ప్రభుత్వం విడుదల చేసి చెల్లింపులు జరపాలని కోరారు. ఏలూరు నగరంలో విలీనం చేసిన 6 గ్రామాల్లో ఉపాధి హామీ పనులు నిలిపివేయడం దుర్మార్గమని విమర్శించారు. ఆ. ఆయా గ్రామాల్లో కూడా ఉపాధి హామీ పనులు చూపించాలని డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లాలో ఉపాధి హామీ పనులు కేవలం ఉద్యానవన తోటలకు మాత్రమే పరిమితం చేయడం తగదని పేర్కొన్నారు. గ్రామాల్లో వ్యవసాయానికి, తాగునీటికి అవసరమైన చెరువు పనులు కూడా ఉపాధి హామీ పనులుగా చేయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చే విధంగా వ్యవసాయ పనులకు మాత్రమే ఈ చట్టాన్ని వర్తింపజేయాలని చూస్తోందని, ఇది సరికాదని, ఇప్పటి వరకు ఉపాధి హామీ పనులు సాగుతున్నట్లే ఇక మీదట కూడా సాగాలని, కేవలం గ్రామాలకే పరిమితం కాకుండా పట్టణాలకు కూడా ఉపాధి హామీ పనులు విస్తరింపజేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు, దళితులకు, వ్యవసాయ కార్మికులకు 200 రోజులు ఉపాధిని చూపాల్సిన బాధ్యత ఉందని, పనులు కల్పించాలని, రోజుకు రూ.600లు వేతనం ఇవ్వాలని రవి డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఎండలు బాగా మండిపోతున్నాయని రోజుకు 40 నుండి 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అవుతోందని ఈ పరిస్థితుల్లో ఉపాధి హామీ పని ప్రదేశాల్లో కనీస మౌలిక వసతులు కల్పించాలని, మజ్జిగ, ఓఆర్ఎస్. ప్యాకెట్లు, పని ప్రదేశంలో నీడ ఉండేటట్లు టెంట్లు, పనిముట్లు ఏర్పాటు చేయాలని కోరారు. తక్షణం ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రాష్ట్రంలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను శాంతియుతంగా, స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా నిర్వహించవలసిన బాధ్యత జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్‌సిలపైనే వుందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా పేర్కొన్నారు. అమరావతిలో అందరూ సమన్వయం, ఓర్పుతో వ్యవహరిస్తూ సమస్యలపై సమగ్ర అవగాహనలతో తక్షణమే స్పందిస్తూ పరిష్కరించాలని ఆదేశించారు. శనివారం రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, పోలీస్ సూపరింటెండెంట్లు, పోలీస్ కమీషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష చేశారు. ఇందులో భాగంగా ఏలూరు ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, ఎస్‌పి డి.మేరీ ప్రశాంతి, పిఒ ఐటిడిఎ ఎం.సూర్యతేజ, డిఆర్ఒ డి.పుష్పమణి, జిల్లాలోని రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు వీడియోకాన్ఫరెన్స్‌లో హాజరయ్యారు. ఎన్నికల కమీషన్ ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ ఎన్నికల్లో ఎటువంటి హింసకు, రీపోలింగ్‌కు తావులేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఇంటర్నల్ సరిహద్దులు, జిల్లా సరిహద్దుల్లో పటిష్టంగా చెక్‌పోస్టుల వద్ద నిఘాపెట్టి గంజాయి, లిక్కర్, నగదు, ఉచిత అక్రమ రవాణా వస్తువులపై తనిఖీలు పటిష్టంగా చేపట్టాలని ఎన్నికల అధికారులకు సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, వ్యక్తులు రూ.50 వేలకు మించి నగదు కలిగివుంటే వెంటనే జప్తుచేయాలన్నారు. వ్యాపారులు, సాధారణ పౌరుల విషయంలో ఆచి తూచి అడుగు వేయాలని, వారిని ఎటువంటి ఇబ్బందులకు గురిచేయవద్దని తెలిపారు. నగదు జప్తు కేసులను 24 గంటల్లోనే పరిష్కరించాలని ఇందుకే రాష్ట్ర మంతా ఒకే విధానాన్ని అవలంబిచేలా ఎస్ఒపిని రూపొందించి, కమ్యూనికేట్ చేయనున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన ఫిర్యాదులపై తక్షణమే చర్యలు చేపట్టాలని, ఫిర్యాదులపై జిల్లాస్థాయిలోనే సమగ్రమైన విచారణ జరిపి చర్యలు తీసుకున్న తదుపరి మాత్రమే నివేదిక పంపాలని సూచించారు. రూ.10 లక్షలకు పైబడి జప్తుచేయబడిన నగదు, బంగారం ఇతర విలువైన వస్తువుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఇన్ కంటాక్స్ అధికారులకు తెలియజేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిస్పోజల్ ఫారమ్స్ పెండెన్సీ, ఎంసిసి రిపోర్టు, గ్రీవెన్స్ కమిటీ సీజ్, ఎంసిసి వైలెన్స్, సి.విజిల్ కేటగిరి క్యాష్ రిపోర్టు, ఎన్‌ఫోర్స్‌మెంట్ మోడల్ కోడ్ రిపోర్టు, తదితర అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్‌పిల ద్వారా సమాచారంపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సమీక్ష చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాలోని రిటర్నింగ్ అధికారులైన ఎన్ఎస్ కె.ఖాజావలీ, ఎం.ముక్కంటి, కె.అద్దయ్య, వై.భవానీశంకరి, కె.భాస్కర్, కలెక్టరేట్ ఎఒ కాశీవిశ్వేశ్వరరావు, నోడల్ అధికారులు, జెడ్‌పి సిఇఒ కెఎస్ఎస్.సుబ్బారావు, డిపిఒ తూతిక శ్రీనివాస విశ్వనాథ్, డిఇఒ అబ్రహం, ట్రైయినీ డిప్యూటీ కలెక్టర్ భానుశ్రీ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జెసి, ఎస్‌పి, అధికారులు

న్యాయ సూత్రాలపై అవగాహనతోనే వృద్ధి

ఒకటో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి రామ్‌గోపాల్

ప్రజాశక్తి - ఏలూరు

న్యాయ సూత్రాలపై అవగాహన కలిగి ఉంటే న్యాయవాదులు వృత్తిలో వృద్ధి చెందుతారని ఒకటో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి జి.రామ్‌గోపాల్ అన్నారు. శనివారం ఏలూరు బార్ అసోసియేషన్ హాల్లో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) ఆధ్వర్యంలో జూనియర్ న్యాయవాదులకు ప్రొఫెషనల్ జిల్లా క్లాసులు నిర్వహించారు. ఈ క్లాసులకు ఒకటో అదనపు జిల్లా న్యాయమూర్తి రామ్‌గోపాల్ ముఖ్యఅతిథిగా విచ్చేసి అడ్మిసిబుల్ ఆఫ్ డాక్యుమెంట్స్ ఇన్ సివిల్ కేసెస్, ప్లీడింగ్స్ ఇన్ సివిల్ కేసెస్‌పై మాట్లాడారు. గతంలో ఎక్కువ మంది న్యాయవాదులు వృత్తిని కొనసాగిస్తూ రాజకీయాల్లో, దేశ, సమాజ సేవకు అంకితమై ఉండేవారని తెలిపారు. నేడు సమాజ సేవ చేసే న్యాయవాదులు తక్కువగా ఉన్నారన్నారు. ప్రతి జూనియర్ న్యాయవాదీ వృత్తిలో నైపుణ్యం కోసం నిరంతరం చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. న్యాయ సూత్రాలకు అనుగుణంగా వృత్తి నిర్వహించాలని, ప్రజాస్వామ్యంలో మనం పరిపాలించుకునేందుకు చట్టాలు చేస్తున్నారని, వాటికి అనుగుణంగానే వృత్తిని నిర్వహించాలని అన్నారు. ఎపి బార్ కౌన్సిల్ మెంబర్ బివి.కృష్ణారెడ్డి మాట్లాడుతూ యువ న్యాయవాదులు ప్రతిరోజూ హాజరై కోర్టులో జరిగే ప్రొసీడింగ్స్ తెలుసుకోవాలని అన్నారు. ముందుగా డబ్బును సంపాదించుకోవడం నేర్చుకోరాదని వత్తిలో మెలకువలు తెలుసుకుంటే వృత్తి డబ్బు ఇస్తుందని తెలిపారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు దిగుబాటి రాజగోపాల్ మాట్లాడారు. ఈ క్లాసులకు ప్రిన్సిపల్‌గా ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఓరుగంటి శైలజ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎంఎం.నాగరాజు, ఐలూ జిల్లా ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి, రాష్ట్ర సంఘ సభ్యులు గెద్ద విజయ భాస్కర్, పి.వెంకట్, పి.పరమేశ్వర రావు, రాజారావు, కౌరు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల బకాయిలు విడుదల చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పెండింగ్‌లో ఉన్న నాలుగున్నర కోట్ల ఉపాధి హామీ వేతన బకాయిలు విడుదల చేయాలని, ఏలూరు నగరంలో విలీనం చేసిన ఏడు గ్రామ పంచాయతీల పేదలకు ఉపాధి పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ తెలిపారు. శనివారం డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎ.రాముకి సంఘం జిల్లా కమిటీ బృందం డ్వామా కార్యాలయంలో వినతిని అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వేతన బకాయిలు సుమారు నాలుగున్నర కోట్ల రూపాయలు ఉన్నాయన్నారు. కానీ అవి నేటికీ విడుదల చేయకపోవడంతో పేదలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక పక్క వ్యవసాయ పనులు లేక ఇబ్బంది పడుతుంటే ఆసరాగా ఉన్న ఉపాధి పనులకు వెళితే నేటికీ కూలీలకు రావాల్సిన వేతనాలు సకాలంలో రాకపోవడంతో ఉపాధి కూలీల కుటుంబాలు అప్పుల పాలయ్యాయన్నారు. కూలీల పని నాణ్యత గురించి చర్చోపచర్చలు చేస్తున్న అధికారులు వారికి రావాల్సిన వేతనాలు కనీసం 15 రోజులకు ఇవ్వాల్సి ఉందని తెలియదా అని ప్రశ్నించారు. కూలీల పట్ల ఉపాధిహామీ అధికారుల తీరు మార్చుకోవాలని హిత బోధ చేశారు. ఉపాధి పనులు చేస్తున్న కూలీలు ఉంటేనే ఈ సంస్థ నడుస్తుందని గుర్తు చేశారు. ఏప్రిల్ ఒకటి నుంచి కొత్త ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించే పనులు వెంటనే అన్ని మండలాల్లో ప్రారంభించాలని డిమాండ్ చేశారు. పాత వేతన బకాయిల విడుదల చేయాల్సి ఉండగా ప్రభుత్వం విడుదల చేయకపోవడం దుర్మార్గమన్నారు. ఏలూరు నగరంలో విలీనం చేసిన గ్రామాలకు ఉపాధి హామీ పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు పని దినాలు పెంచాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన పోరాటాలకు సన్నద్ధమవుతావని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్, ఆగ్నేశయమ్మ, ఆనందరావు, సుధమ్మ పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న వ్యకాస నాయకులు



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

దౌర్జన్యంగా పంటను ఎత్తుకుపోయారు

తహశీల్దార్ కార్యాలయం వద్ద గ్రామస్తుల ఆందోళన

బుట్టాయగూడెం: భూవివాదం నేపథ్యంలో మర్రిగూడెంకు చెందిన కొందరు గ్రామస్తులు తమ జీడిమామిడి తోటలో ప్రవేశించి దౌర్జన్యంగా పంటను ఎత్తుకుపోయారని బాషా రంపాల్ రాజు కుటుంబ సభ్యులు స్థానిక ఎంఆర్ఒ ఆఫీస్ ఎదురుగా రోడ్డుపై బైఠాయించారు. పొలంలో ఏర్పాటు చేసుకున్న తాటకు ఇంటిలోని సామాన్లు ధ్వంసం చేసి ఇంటిని తగలబెట్టారని పోలీసు, రెవెన్యూ అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా తమకు న్యాయం చేయడం లేదని తెలిపారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇప్పటికైనా తహశీల్దారు పోలీస్‌లు కల్పించుకొని మా భూమికి, దౌర్జన్య కారుల నుంచి రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వేములూరి నాగేంద్ర, వెంకటలక్ష్మి, బి.సౌజన్య, రాజేష్ పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

ఏలూరు స్పోర్ట్స్: మండలంలోని నార్త్ ఏలూరు 33/11 కేవీ అశోక్ నగర్ సబ్ స్టేషన్ సెక్షన్ పరిధిలో ఈనెల (ఆదివారం) ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మరమ్మతులు చేయబడునని ఏలూరు ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జెపిబి నటరాజన్ తెలిపారు. కావున అశోక్ నగర్ స్టేషన్ పరిధిలోని ఆర్ఆర్ పేట, 4 గుళ్ళ సెంటర్, పానుగంటి వారి వీధి, అతిథి హోటల్ రోడ్ శంకమటం, విజయ విహార్ సెంటర్, అమీనపేట, అశోక్ నగర్, పతేబాద్, మోతేవారితోట, దాసరి ఎర్రయ్యవీధి, నరసింహారావు పేట, పవర్ పేట, పోలీస్ క్వార్టర్స్, రంగూన్ మేడ రోడ్‌లలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని తెలిపారు.

కొనసాగిన 'పది' మూల్యాంకనం

ఏలూరు సిటీ: పదవ తరగతి ప్రశ్నాపత్రాల మూల్యాంకనం శనివారం 6వ రోజు 88.2 శాతానికి చేరుకుందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.అబ్రహం తెలిపారు. నగరంలోని సెంట్ జేవియర్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షల పేపర్ల మూల్యాంకనం ఆరు రోజులుగా నిర్వహిస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు మూల్యాంకనం జరుగుతుందని తెలిపారు. సిబ్బంది 1019 మంది హాజరయ్యారని, ఎటువంటి ఇబ్బంది లేకుండా మూల్యాంకనం ప్రశాంతంగా జరిగిందని విద్యాశాఖ అధికారి అబ్రహం తెలిపారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

మండల ఉద్యాన శాఖాధికారి కె.జ్యోతి ప్రియాంక

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మామిడి పంటలో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టడం వల్ల తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులను సాధించవచ్చునని ఆగిరిపల్లి మండల ఉద్యానశాఖాధికారిణి కె.జ్యోతి ప్రియాంక అన్నారు. మండలంలోని చొప్పరమెట్ల గ్రామంలోని మామిడి తోటలను ఆమె పరిశీలించి మామిడిలో నల్లమచ్చ తెగులు నివారణకు కాపరాక్సీక్లోరైడ్ 3 గ్రాములు 1 లీటర్ నీటికి, స్ట్రెప్టోసైక్లీన్ లేదా అగ్రమైసిన్ 2గ్రాములు 10 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలని, పండు ఈగ నివారణకు లింగాకర్షణ బుట్టలు ఎకరానికి 8 చొప్పున అమర్చాలని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉద్యానశాఖ సహాయకులు పి.రమేష్, రైతులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న జ్యోతి ప్రియాంక

అందరూ కలిసికట్టుగా పనిచేయాలి

టిడిపి ఏలూరు ఎంపీ అభ్యర్థి మహేష్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

రాబోయే రోజులలో అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఏలూరు టిడిపి ఎంపీ అభ్యర్థి పుట్ట మహేష్ అన్నారు. మహేష్ కుమార్ యాదవ్ శనివారం ఏలూరు పార్లమెంట్ కార్యాలయంలో వివిధ పార్టీల అనుబంధ సంఘాల ముఖ్య నాయకులతో సమావేశం అయ్యారు. వారి సమస్యలు, సంక్షేమం గురించి చర్చించారు. ఎలా ముందుకు వెళ్ళాలి, ఏవిధంగా ఏలూరు పార్లమెంట్ పరిధిలో ఉన్న ఎంపీ, ఎంఎల్ఎ అభ్యర్థులను అత్యంత మెజారిటీతో ఎలా గెలిపించుకోవాలో ఒక కార్యాచరణ ప్రణాళిక ప్రకారం సిద్ధం చేసి కలసి కట్టుగా పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు, బిసి, ఎస్‌సి, మైనార్టీ, మహిళా, యువత, విద్యార్థిని విభాగాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించాలి

లక్కవరంలో గ్రామస్తుల నిరసన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

మండలంలోని లక్కవరం గ్రామంలో లోవోల్టేజీ సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు నిరసన చేపట్టారు. లో వోల్టేజీతో పాటు మరోపక్క సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లు ఎప్పటికప్పుడు పోతున్నప్పటికీ విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చీకట్లో దోమలతో పిల్లలు అవస్థలు పడుతున్నారని, ఎన్నిసార్లు చెప్పినా సమస్య పరిష్కారం కావడం లేదని లక్కవరం పవర్ స్టేషన్ దగ్గర గ్రామస్తులు శనివారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. పవర్ స్టేషన్ అధికారి అందుబాటులో లేరని, అభివృద్ధి అని చెప్పుకునే ప్రభుత్వానికి ప్రజా సమస్యలు పట్టవా అని స్థానిక ప్రజలు ప్రశ్నించారు.

'వైసిపి హయాంలో అభివృద్ధి కుంటుపడింది'

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

వైసిపి ప్రభుత్వంలో సంక్షేమం సంక్షోభంలోకి వెళ్లిందని, పేదలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్‌చంద్ర శేషు అన్నారు. మండలంలోని శ్రీనివాసపురం గ్రామంలో పార్టీ అధ్యక్షుడు పొల్నాటి సత్యనారాయణ ఆధ్వర్యంలో సూపర్ సిక్స్ పథకాలకు సంబంధించిన శంఖారావం రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇంటి ఇంటికీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శ్యామ్‌చంద్ర శేషు మాట్లాడుతూ పెరిగిన విద్యుత్ ధరలు, నిత్యావసర ధరలు, డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలు అధిక పన్నులతో రాష్ట్రం అతలాకుతలం అయ్యిందని అన్నారు. రాష్ట్ర ప్రగతి సాధించాలన్నా, పేదలకు సరైన సంక్షేమం అందాలన్నా అది టిడిపి కూటమితోనే సాధ్యం అని అన్నారు. రానున్న రోజుల్లో చంద్రబాబు అధికారంలోకి వస్తే ఈ రెండు నెలలకు కలిపి రూ.4 వేలు పెన్షన్ అందించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల రైతు అధ్యక్షులు ఎలికే ప్రసాద్, మండల ఎస్‌సి సెల్ అధ్యక్షుడు గొల్లమందల శ్రీనివాస్, బూత్ కన్వీనర్లు రాగాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

మూడోసారి విజయం నాదే

ఎంఎల్ఎ అభ్యర్థి వెంకట ప్రతాప్ అప్పారావు

ప్రజాశక్తి - చాట్రాయి

రాబోయే ఎన్నికల్లో మూడోసారి విజయం తనదేనని వైసిపి నూజివీడు నియోజకవర్గం ఎంఎల్ఎ అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండల కేంద్రమైన చాట్రాయిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చాట్రాయి రామాలయం సెంటర్ వద్ద ప్రచారం నిర్వహిస్తూ ఆయన మాట్లాడుతూ నేను రాజశేఖర్ రెడ్డి ప్రియ శిష్యుడునన్నారు. ఆయన నన్ను పిలిచి ఎంఎల్ఎగా అవకాశం ఇచ్చారని, వైఎస్.రాజశేఖర్ రెడ్డిని మించిన పరిపాలన తన కుమారుడు మన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి అందిస్తున్నారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో మూడోసారి కూడా విజయం సాధిస్తానని, మళ్లీ మన రాష్ట్రానికి వైఎస్.జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారంలోకి వస్తారని అన్నారు. ఆయన చేస్తున్న సంక్షేమ పథకాలు చూసి ప్రజలందరూ వైసిపికి ఓట్లు వేయాలని కోరారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

సిఐ క్రాంతికుమార్

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

సమస్యాత్మక గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రజలంతా సహకరించాలని జీలుగుమిల్లి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ టి.క్రాంతి కుమార్ పేర్కొన్నారు. మండలంలోని ములగలంపల్లి, స్వర్ణవారిగూడెం, పి.అంకంపాలెం, దర్భగూడెం గ్రామాలలో కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక ప్రాంతాలలో శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. అదేవిధంగా ప్రజల భద్రతకు భరోసా కల్పించుటకు సాయుధ బలగాలతో కవాతు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వైసిపిని మళ్లీ గెలిపించాలి

వైసిపి నియోజకవర్గ అభ్యర్థి విజయరాజు

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందాలంటే రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం రావాలని చింతలపూడి నియోజకవర్గ వైసిపి అభ్యర్థి కంభం విజయ రాజు అన్నారు. మండలంలోని వెంకటాద్రి గూడెం పంచాయతీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ అభివృద్ధి జరగాలంటే రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు జానకి రెడ్డి, జెడ్‌పిటిసి మోలుగుమాటి నీరజ సుధాకర్ పాల్గొన్నారు.

'డిఎన్ఆర్, సునీల్ కుమార్ యాదవ్‌ను గెలిపించాలి'

ముదినేపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎంఎల్ఎగా దూలం నాగేశ్వరరావును, ఎంపీగా కారుమూరు సునీల్ కుమార్ యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కైకలూరు ఎంఎల్ఎ డిఎన్ఆర్ కోడలు దూలం స్వాతి అన్నారు. శనివారం మండలంలోని సింగరాయపాలెంలో వైసిపి శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికల ప్రచారంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, గంటా సంధ్య, వైస్ ఎంపిపిలు సునీత, రాధా పాల్గొన్నారు.

రాధా రుక్మిణి మృతికి సంతాపం

ముసునూరు: అమరజీవి కూచిపూడి లక్ష్మి నారాయణ భార్య కూచిపూడి రాధా రుక్మిణి శనివారం ఉదయం మండలంలోని చెక్కపల్లి గ్రామంలో తమ ఇంటి వద్ద కీర్తిశేషులయ్యారు. సిపిఐ నాయకులు అక్కినేని వనజ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బత్తుల వెంకటేశ్వరరావు, సిపిఐ జిల్లా రైతు సంఘం నాయకులు, మండల రైతు సంఘం నాయకులు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నేరాలు - ఘోరాలు

నాటుసారా విక్రేతపై కేసు

టి.నరసాపురం: నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ డి.దుర్గా మహేశ్వరరావు శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వెలగపాడు గ్రామ శివార్లలో ప్రభుత్వం నిషేధించిన నాటుసారా తయారు చేసి విక్రయిస్తున్నారనే సమాచారంతో ఎస్ఐ తన సిబ్బందితో దాడి చేసి 30 లీటర్ల నాటుసారా, సారా తయారు చేసే సామాగ్రి స్వాధీనం చేసుకుని, 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి ముద్దాయిని రిమాండ్ నిమిత్తం చింతలపూడి కోర్టుకు తరలించినట్లు ఆయన తెలిపారు.

150 లీటర్ల నాటుసారా స్వాధీనం

పోలవరం : మండలంలోని చేగొండపల్లి పంచాయతీ మెత్తప్పకోట అటవీ ప్రాంతంలో పోలవరం పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేసి అక్రమంగా నిర్వహిస్తున్న నాటుసారా తయారీ బట్టీపై దాడులు నిర్వహించారు. ఈ దాడిలో 150 లీటర్ల నిషేధిత నాటుసారా పట్టుబడగా, 2 వేల లీటర్ల బెల్లపు ఊటను పోలీసులు ధ్వంసం చేశారు. బట్టీ నిర్వాహకుడు ఎమ్.సోమరాజు(47) పట్టుబడగా మరో ఇద్దరు నిందితులు పరారయ్యారు. అరెస్ట్ చేసిన వ్యక్తిని కోర్టులో ప్రవేశ పెట్టగా, జంగారెడ్డిగూడెం మొదటి తరగతి జుడీష్యల్ మెజిస్ట్రేట్ అతనికి ఈనెల 19 వరకు రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నిందితుడిని జిల్లా జైలుకు తరలించడమైనది.

అడుగంటిన తాగునీటి చెరువులు

ఏలూరు డిఎల్‌పిఒ చంద్రశేఖర్ పరిశీలన

ప్రజాశక్తి - భీమడోలు

మల్లవరం, కొత్త మల్లవరం గ్రామాలలోని చెరువుల నీటిమట్టం అడుగంటిపోయినట్లు, చెట్టున్నపాడు, ఆగడాల లంక గ్రామాల్లో గల చెరువులను అత్యవసరంగా నింపవలసిన ఆవశ్యకత ఉందని ఏలూరు డిఎల్‌పిఒ చంద్రశేఖర్ తెలిపారు. శనివారం ఆయన ఆ ప్రాంతాల్లో పర్యటించారు. మండలంలోని కొల్లేరు సరస్సు ఆవాస గ్రామాలలో తాగునీటి కొరత ఏర్పడింది. ముఖ్యంగా ఆగడాలలంకతో పాటు, చెట్టున్న పాడు, మల్లవరం, కొత్త మల్లవరం గ్రామాలలోని తాగునీటి చెరువులను నింపవలసి ఉంది. కానీ వీటికి తాగునీటిని సరఫరా చేసే ఏకైక వనరైన ఆగడాల లంక ఛానల్ కాలువకు నీరు విడుదల కాకపోవడంతో ప్రజలకు సమాధానం చెప్పవలసిన అధికారులు, ఇటు ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గతనెల 21వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఆగడాల లంక ఛానల్‌కు తాగునీరు విడుదల చేస్తామన్న జల వనరుల శాఖ అధికారులు అమలులో విఫలమయ్యారు. వారు అత్యవసరంగా సాగునీటిని సరఫరా చేయవలసిన పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో తాగునీటిని సరఫరా చేయలేకపోయామని సర్ది చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో చెరువులలో గల



చెట్టున్న పాడులో తాగునీటి చెరువును పరిశీలిస్తున్న అధికారులు

తాగునీటి నిల్వలను పరిశీలించేందుకు డిఎల్‌పిఒ చంద్రశేఖర్ ఆ ప్రాంతాల్లో పర్యటించారు. ఈమేరకు జల వనరుల శాఖ ఉన్నతాధికారులతో ఫోన్‌లో ఆయన సంప్రదించారు. దీనిపై స్పందించిన వారు అత్యవసరంగా వరి పొలాలకు సాగునీటిని చివరి విడతగా అందజేయవలసిన ఆవశ్యకత ఉన్న నేపథ్యంలో ఆగడాల లంక ఛానల్‌కు తాగునీటిని విడుదల చేయలేదని తెలిపారు. సోమవారం నుంచి ఆగడాలలంక ఛానళ్లకు నీరును విడుదల చేస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ విషయాలపై ఎంపిడిఒ, గ్రామీణ నీటి సరఫరా సంస్థ భీమడోలు సహాయ ఇంజనీర్ రామారావులను వివరణ కోరగా మండల పరిధిలోని 13 తాగునీటి చెరువులు, రెండు సమగ్ర నీటి సరఫరా పథకాల నిర్వహణకు అవసరమైన నీటి సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ప్రస్తుతం ఆగడాల లంక, చెట్టున్న పాడు, మల్లవరం, కొత్త మల్లవరం గ్రామాలలోని చెరువులను నింపేందుకు జల వనరుల శాఖ సహకారంతో చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇదే క్రమంలో పశువులకు సైతం తాగునీటి ఇబ్బందులు లేకుండా చూసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. రానున్న కాలంలో తాగునీటి ఎద్దడి ఏర్పడే గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ప్రస్తుతం నీటి సరఫరా కార్యక్రమం సజావుగా కొనసాగేందుకు మండల స్థాయి అధికారంతో కూడిన ఒక బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో భీమడోలు పంచాయతీ విస్తరణ అధికారి ఎ.సుందరి, చెట్టున్నపాడు గ్రామపంచాయతీ కార్యదర్శి డి.వెంకట్రావు పాల్గొన్నారు.

నవోదయకు జెడ్‌పిహెచ్ విద్యార్థి జయదుర్గ

ప్రజాశక్తి - కలిదిండి



మండలంలోని గుర్వాయిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న పోసిన జయదుర్గ నవోదయ స్కూల్‌లో సీటు సాధించినట్లు ఎంఇఒ పిడుగు ప్రభాకర బాబు తెలిపారు. విద్యార్థి తల్లిదండ్రులు దినసరి కూలీలు. జయదుర్గ సీటు సాధించడం పట్ల తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు, తోటి విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయుడు బస్వా రావుకు, విద్యార్థి జయ దుర్గకు ఎంఇఒ అభినందనలు తెలిపారు.

ఆరోగ్యం పట్ల అవగాహనుండాలి

జంగారెడ్డిగూడెం టౌన్ : ప్రతిఒక్కరూ ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండి, చుట్టూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటూ, మంచి పోషక ఆహారాలను తీసుకోవాలని బార్ జనరల్ సెక్రటరీ విత్తనాల రాజు అన్నారు. అర్బన్ పిహెచ్‌సి, డాంగే నగర్, జంగారెడ్డిగూడెంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయన సూచించారు. ప్రపంచ దేశాలన్ని ప్రజల ఆరోగ్యాన్ని ఒక ప్రాథమిక హక్కుగా గుర్తించాలని డబ్ల్యూహెచ్ఒ సూచించిందని తెలిపారు. అంతేకాకుండా స్వచ్ఛమైన నీరు, గాలి, వాతావరణం, ఆహారం లాంటి మానవ కనీస అవసరాలను ప్రభుత్వం కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా బార్ మెంబర్స్ మేకల రామ్మోహన్‌రావు, తొర్లపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు

వాలీబాల్‌లో నైపుణ్యం ప్రదర్శించాలి

మండవల్లి: వాలీబాల్ ఆటలో మరింత నైపుణ్యం ప్రదర్శించి దేశం గర్వించదగ్గ క్రీడాకారునిగా రాణించాలని అంబేద్కర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు ఎల్ఎస్.భాస్కరరావు, చావత్తిన విజయ్ కోరారు. రాష్ట్రస్థాయిలో వాలీబాల్ ఆడేందుకు ఎంపికైన మేడేపల్లి అమృతను తన నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసి కాలనీకి చెందిన మేడేపల్లి సైమన్, వల్లి పద్మల కుమార్తె మేడేపల్లి అమృత కైకలూరులోని హెూలీ క్రాస్ ప్రయివేట్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతుంది. 2012-2013 సంవత్సరంలో గుంటూరు జిల్లా నరసరావుపేట, 2013-2014లో విశాఖ జిల్లా అరకులో జరిగిన వాలీబాల్ టోర్నమెంట్‌లో అమృత పాల్గొని ఆటలో మంచి నైపుణ్యత కనబరిచిందని అన్నారు. ఆటలో మరింత రాణించే విధంగా పిటి నాగరాజు అమృతకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి, ఏడాది ఫిబ్రవరిలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వాలీబాల్ అకాడమీ నిర్వహించిన సెలక్షన్‌లో అమృత అద్భుతమైన ప్రతిభను కనబరిచిందన్నారు. దీంతో రాష్ట్రస్థాయి వాలీబాల్ ఆటలు ఆడేందుకు అమృతకు అవకాశం దక్కిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు బేతపూడి తంబిదాస్, కార్యదర్శి రవి వరప్రసాద్, ట్రెజరర్ వినోద్ కుమార్ పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళినిఉల్లంఘిస్తే చర్యలు

ఏలూరు టౌన్: ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై వచ్చిన ఫిర్యాదుల మేరకు ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి యం.ముక్కంటి వివరణ ఇచ్చారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చిన దగ్గరి నుంచి తగు చర్యలు తీసుకోవడం జరుగిందన్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం కీర్తిశేషుల శిలాఫలకాలందలి ఫోటోలకు, పేర్లను తొలగించవలసిన ఆవశ్యకత లేదని స్పష్టం చేశారు. ఏలూరులో ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిన నేపథ్యంలో ఆయా శిలఫలకాలపై ప్రజాప్రతినిధుల పేర్లు కనిపించకుండా పకడ్బందీగా వస్త్రాలతో ముసుగు వేయడం జరిగిందన్నారు. వివిధ పార్టీల రంగులు కనిపించకుండా తెల్ల రంగును వేయడం జరిగిందని తెలిపారు.

అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి

జీలుగుమిల్లి: మండలంలో ఉన్న వివిధ శాఖల అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని ఎంపిడిఒ కెవిఎమ్.మంగతాయారు పేర్కొన్నారు. శనివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఉన్న అధికారులు సమస్యల పట్ల దృష్టి సారించాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో ఉన్నామంటు అభివృద్ధి పనులను గాలికొదిలేస్తే సహించేది లేదని అన్నారు. అట్టి వారిపై ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వాల్సి వస్తుందని హెచ్చరించారు. ముఖ్యంగా వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న దృష్ట్యా తాగునీటి కొరత లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. అదేవిధంగా వైద్య సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

'పది' మూల్యాంకనం వద్ద మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఎండలు తీవ్రంగా ఉండటం వల్ల శనివారం ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పదవ తరగతి మూల్యాంకన విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బందికి మూల్యాంకన కేంద్రం వద్ద మజ్జిగను పంపిణీ చేశారు. మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా విద్యా శాఖాధికారి ఎస్.అబ్రహం చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం మాట్లాడుతూ వేసవి దృష్ట్యా మూల్యాంకన కేంద్రం వద్ద మజ్జిగ పంపిణీ చేయడం మంచి సేవా కార్యక్రమమని, సంఘాలు ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని చేపట్టాలని అన్నారు. వేసవిలో అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా పిల్లలు బయట తిరగకుండా, వారికి తగిన జాగ్రత్తలు తెలియజేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ పరీక్షల నిర్వహణ అసిస్టెంట్ కమిషనర్ ఎల్.శ్రీకాంత్, డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్, పెదవేగి మండల విద్యాశాఖ అధికారి బి.బుద్ధవ్యాస్, ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి బి.ఎ.సాల్మన్ రాజు, ఏలూరు జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రామారావు, బి.రెడ్డి దొర, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.దొరబాబు, చింతలపూడి, నిడమర్రు, ఏలూరు నగర బాధ్యులు రవికుమార్, ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులతో విడదీయలేని అనుబంధం

టిడబ్ల్యు ఆశ్రం గెజిటెడ్ హెడ్‌మాస్టర్ సోమసుందర్

ప్రజాశక్తి - చింతలపూడి

34 సంవత్సరాలుగా విద్యార్థులతో విడదీయలేని అనుబంధం ఏర్పడిందని టిడబ్ల్యు ఆశ్రం గెజిటెడ్ హెడ్ మాస్టర్ సోమసుందర్ అన్నారు. చింతలపూడి పట్టణలో గత నాలుగు సంవత్సరాలుగా గిరిజన సంక్షేమ పాఠశాల హెడ్ మాస్టర్‌గా సేవలు అందిస్తున్న చాగంటి సోమ సుందర్ స్వచ్ఛంద పదవీ విరమణ సభను పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెడ్ మాస్టర్‌కి, ఆయన సతీమణి అచ్యుత్ లక్ష్మికి ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సేవలు, వారి సహకారం ఎప్పటికీ మర్చిపోలేనన్నారు. నా వంతుగా పాఠశాలలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకున్నానని, అదే మార్గంలో వచ్చే వారందరూ నడుస్తారని ఆశించారు. 1989లో స్కూల్ అసిస్టెంట్‌గా దొరమామిడిలో పనిచేశానని, 2019వ సంవత్సరంలో చింతలపూడికి బదిలీపై వచ్చినట్టు తెలిపారు. 34 సంవత్సరాల కాలంలో విద్యార్థులతో అనుబంధం ఏర్పడిందని, టిఆర్ఎస్ తీసుకోవడం బాధ కలిగించినా, కొన్ని కారణాల వల్ల తీసుకోక తప్పడం లేదని అన్నారు. సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కళాకారుల బకాయిలు విడుదల చేయాలి

ప్రజానాట్య మండలి జిల్లా కన్వీనర్ టివిఎస్.రాజు

ప్రజాశక్తి - టి.నరసాపురం

కళాకారులకు రావలసిన బకాయిలు వెంటనే విడుదల చేసి, వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ప్రజానాట్యమండలి జిల్లా కన్వీనర్ టివిఎస్ రాజు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. టిడిపి అధికారంలో ఉన్న కాలంలో 2014 నుంచి 2019 వరకు అప్పటి ప్రభుత్వం కళా ప్రదర్శన ద్వారా సంక్షేమ పథకాల ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయడం కోసం కళాకారులను ఉపయోగించుకుందని ఆయన తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో వందలాది మంది కళాకారులు బుర్రకథలు, వీధి నాటికలు, నృత్య ప్రదర్శనలు, జానపద గేయాలు తదితర కళారూపాలు ప్రదర్శించి ప్రజలకు సంక్షేమ పథకాలపై సమగ్ర అవగాహన కల్పిస్తే, కళాకారులకు రావలసిన ఆర్థిక పారితోషకం ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా నేటికీ అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉభయగోదావరి జిల్లాలకు చెందిన కళాకారులకు సుమారు రూ.2 కోట్ల వరకు రావాల్సి ఉందని ఆయన తెలిపారు. గత ప్రభుత్వ కాలంలో వివిధ పథకాలకు రోడ్లు, వంతెనల నిర్మాణాలకు కాంట్రాక్టర్లకు చెల్లించవలసిన బకాయిలను విడతల వారీగా చెల్లించినట్లుగా, కళాకారులకు రావలసిన బకాయిలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి కృష్ణ చైతన్య

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా వేదిక తరపున పోటీచేసే అభ్యర్థులను గెలిపించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సిపిఐ పట్టణ కార్యాలయంలో మండల సమితి సాధారణ సమావేశం రేల నరసింహారావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కృష్ణచైతన్య మాట్లాడుతూ దేశంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి నుంచి విముక్తి కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మోడీ పాలనా పగ్గాలు చేపట్టిన నాటి నుంచి ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల మధ్యలో కుల, మత విద్వేషాలు రగిల్చి, మతసామరస్యానికి తూట్లు పొడుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నూతన విద్యా విధానం పేరుతో విద్యను కాషాయకరణ చేయడానికి కుట్ర పన్నుతున్నారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులైన అదానీ, అంబానీలకు కారు చౌకగా కట్టబెడుతూ ప్రయివేటీకరణకు తెరతీశారని మండిపడ్డారు. గత ఎన్నికల సందర్భంగా తాను అధికారంలోకి రాగానే దళారులను నియంత్రించి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని వాగ్దానం చేసి, ప్రజలను, రైతులను మోసం చేశారని విమర్శించారు. ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానని నిరుద్యోగ యువతను నమ్మించి ఉద్యోగ కల్పన ఊసే లేకుండా, ఉన్న ఉద్యోగాలు ఊడబెట్టిన ఘనుడు మోడీ అని ఎద్దేవా చేశారు. దేశంలో ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన పాలకపక్షాలను విడదీసి బిజెపి దొడ్డిదారిన అధికారం చేపడుతుందని విమర్శించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్, ప్రధాన ప్రతిపక్షం టిడిపి రెండూ బిజెపి కబంధ హస్తాలలో ఇరుక్కుపోయాయన్నారు. ఇండియా వేదిక అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు, మండల సహాయక కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు పాల్గొన్నారు.

'అభివృద్ధికి కృషి చేస్తే.. టిక్కెట్ ఇవ్వలేదు'

ముసునూరు : దిశా, నిర్దేశం చేసే నాయకత్వం లేని నూజివీడులో టిడిపిని బలోపేతం చేస్తే చివరికి టికెట్ ఇవ్వకుండా చంద్రబాబు మొండిచేయి చూపించారని మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం నూజివీడు ఎంఆర్ అప్పారావు కాలనీ, వెలమ పేటలో ఆయన ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముద్దరబోయిన మాట్లాడుతూ 2014లో తాను టికెట్ అడక్కపోయినా పిలిచి టికెట్ ఇచ్చిన చంద్రబాబునాయుడు, నేడు మొండిచేయి చూపించారన్నారు. ఆనాడు టిడిపి నాయకుల తీరుతో తాను ఓటమి చెందానన్నారు. కార్యకర్తల అభీష్టం మేరకు వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, గెలిపించాలని కోరారు.

నగదు స్వాధీనం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

మండలంలోని గురవాయి గూడెం ఎస్ఎస్ టీం వాహన తనిఖీలలో భాగంగా ఏలూరు నుంచి జంగారెడ్డిగూడెం వైపు వస్తున్న కారులో నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న నగదు స్వాధీనం చేసుకున్నట్లు మండల రెవెన్యూ ఆఫీసర్ సెల్వా జోజి తెలిపారు. ఎటువంటి ఆధారాలు లేని రూ.81 వేల 700 నగదును స్వాధీనం చేసుకుని ట్రెజరీకి తరలించినట్లు అన్నారు. నగదుకు సంబంధించిన యజమానులు ట్రెజరీ వారికి సరైన ఆధారాలు చూపించాల్సి ఉంటుందని తెలిపారు.

చింతలపూడి : మండలంలోని అల్లిపల్లి, లింగగూడెం చెక్‌పోస్ట్ వద్ద నగదు స్వాధీనం చేసుకున్నట్లు తహశీల్దార్ గోపాలకృష్ణ అన్నారు. అల్లిపల్లి చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీలు చేస్తుండగా నగదుకు సంబంధించినటువంటి పత్రాలు చూపించకపోవడంతో రూ.93,200, లింగగూడెం చెక్‌పోస్టు వద్ద రూ.63 వేలు స్వాధీనం చేసుకున్నట్లు అన్నారు. స్వాధీనం చేసుకున్న నగదుని ఏలూరు ట్రెజరర్‌కి పంపిస్తున్నట్లు తెలిపారు.

వాలంటీర్ల రాజీనామాలు

వైసిపి ఎన్నికల వ్యూహ రచనలో భాగమే అంటున్న విశ్లేషకులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

గ్రామ వాలంటీర్లు నారాయణపురంలో 10 మంది, తిమ్మయ్యపాలెంలో ఆరుగురు శనివారం రాజీనామాలు చేశారు. ఆయా సచివాలయం, పంచాయతీ కార్యదర్శులకు లేఖలను అందించారు. తామంతా స్వచ్ఛందంగానే రాజీనామాలు చేస్తున్నట్లు వాలంటీర్లు చెప్పారు. కాగా ఎన్నికల ప్రచారాల్లో వాలంటీర్లు పాల్గొనవద్దని ఎన్నికల సంఘం మార్గదర్శకాలు విడుదల చేసిన నేపథ్యంలో అధికార పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చేలా వ్యూహరచనలో భాగంగానే వారితో రాజీనామాలు చేయిస్తున్నారని విశ్లేషకులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

వాలంటీర్లను నియమించింది వైసిపి ప్రభుత్వమే కాబట్టి వాలంటీర్లు కూడా మా పార్టీ కార్యకర్తలు అని బహిరంగంగా ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. రాజీనామాలు చేసిన వారితో ఎన్నికల ప్రచారాల్లో పాల్గొని వారికి కేటాయించిన హౌస్ హోల్డర్లతో తమకు అనుకూలంగా ఓటు వేయించుకునేందుకు వాలంటీర్లను ఉపయోగించుకునేందుకు ఎత్తుగడలో భాగమే ఈ రాజీనామాలు అని చర్చనడుస్తోంది. రాజీనామాలు చేయని వారు ఎన్నికల వరకే ఉంటారని, తిరిగి అధికారంలోకి వచ్చాక అలాంటి వారిని తొలగించి తమకు అనుకూలమైన వారిని నియమించుకుంటామని పలువురు చెబుతున్నారు.

జీలుగుమిల్లి: మండలంలోని దర్భగూడెం సచివాలయ పరిధిలో పనిచేస్తున్న 25 మంది వాలంటీర్లకు గాను 17 మంది వాలంటీర్లు విధులకు రాజీనామా చేస్తున్నట్లు శనివారం రాజీనామా పత్రాలు సమర్పించినట్లు ఎంపిడిఒ కెవిఎమ్.మంగతాయారు తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో వాలంటీర్లను విధులకు దూరంగా ఉంచాలని ఎలక్షన్ కమిషన్ ఆదేశాలు ఇవ్వడంతో మనోవేదనకు గురై రాజీనామా పత్రాలు సమర్పిస్తున్నట్లు వారు తెలిపారన్నారు. వారి రాజీనామా పత్రాలను జిల్లా, గ్రామ, వార్డు సచివాలయ జోనల్ అధికారికి పంపనున్నట్లు ఆమె తెలిపారు.

ముదినేపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో జరిగిన అభివృద్ధిని మరింత జనంలోకి తీసుకువెళ్లడానికి ముదినేపల్లి మండలం సింగరాయపాలెం గ్రామ సచివాలయ పరిధిలోని వాలంటీర్లు అందరూ శనివారం స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. ప్రజలకు మరింత చేరువయ్యి మళ్ళీ రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని, అలాగే స్థానిక ఎంఎల్ఎ దూలం నాగేశ్వరావుని గెలిపించుకుంటామని తెలిపారు. వారి రాజీనామా పత్రాన్ని ఇఒపిఆర్‌డి దూలం లక్ష్మీనారాయణకు అందించారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుటకు అన్ని చర్యలు చేపట్టడం జరుగుతుందని, ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని నూజివీడు డిఎస్‌పి జి.లక్ష్మయ్య కోరారు. శనివారం మండల పరిధిలోని వట్టిగుడిపాడులో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆయన ఆగిరిపల్లి ఎస్ఐ బి.సురేంద్ర కుమార్‌తో కలిసి పరిశీలించారు.

పింఛన్ల పంపిణీ పూర్తి

ఎంపిడిఒ టి.స్వర్ణలత

ప్రజాశక్తి - భీమడోలు

మండల పరిధిలో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం దాదాపుగా పూర్తయ్యిందని మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి టి.స్వర్ణలత తెలిపారు. మండల పరిధిలో 9,125 పెన్షన్లు పంపిణీ చేయవలసి ఉండగా 76 మినహా మిగిలిన పింఛన్ల పంపిణీ కార్యక్రమం పూర్తయిందన్నారు. మిగిలిన వారిలో 44 మంది చనిపోయారని, తక్కిన వారు గ్రామాంతరం వెళ్లినట్టు గుర్తించామన్నారు. ఇక అంబర్‌పేట గ్రామానికి చెందిన 14 మంది వాలంటీర్లు, పూళ్ల-3, మూడు సచివాలయ పరిధిలోని ఒక వాలంటీర్ రాజీనామాలు చేశారని తెలిపారు.

వార్షిక పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - కలిదిండి

ఒకటి నుంచి తొమ్మిదవ తరగతి వరకు వార్షిక పరీక్షలు ప్రారంభమైనట్లు ఎంఇఒ పిడుగు ప్రభాకర బాబు తెలిపారు. ఈ పరీక్షలు ఈనెల 18వ తేదీతో ముగుస్తాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 3వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఈనెల 10వ తేదీన టోఫెల్ (ఇంగ్లీష్ లాంగ్వేజ్) ఎగ్జామ్‌ను ఐఎఫ్‌పి, స్మార్ట్ టీవీలు కలిగిన పాఠశాలల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు. మండలంలో తొమ్మిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలు, నాలుగు ఎంపియుపి పాఠశాలలు ఎంపికయ్యాయన్నారు. టోఫెల్ పరీక్షా పత్రాలు తమ కార్యాలయానికి వచ్చినట్లు ఎంఇఒ తెలిపారు.

రాజారావుకు పరామర్శ

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని పోలవరం గ్రామానికి చెందిన సిపిఎం మండల సీనియర్ నాయకులు చాగంటి రాజారావు మాతృమూర్తి చాగంటి అనసూయ గత బుధవారం కీర్తిశేషులయ్యారు. సిపిఎం జిల్లా కార్యవర్గసభ్యులు జి.రాజు శనివారం చాగంటి రాజారావు గృహానికి వెళ్లి తన ప్రగాఢ సానుభూతిని తెలిపి, చాగంటి రాజారావును పరామర్శించారు.